సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



కొల్లేరు.. కన్నీరు..

ఎగువ నుంచి చేరే వరద నీటిలో కొల్లేరు గ్రామాలు నానుతున్నాయి. వారం రోజులకు పైగా నీరు కదలకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 8లో ▸



మలేరియాతో ఇద్దరి మృతి

అత్తిలి శివారు నేతాజీ నగర్‌కు చెందిన ఇద్దరు యువకులు మలేరియాతో మృతిచెందారు. ఒడిశాలోని రాయఘడ్‌కు వెళ్లినప్పుడు వీరికి మలేరియా సోకింది. 8లో ▸



వారణాసిలో ఆత్మహత్య

ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన సోదరులు వారణాసిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులతో వీరు ఇల్లు వదిలి వెళ్లిపోయారు. 8లో ▸

న్యూస్‌రీల్

శాంతించిన తమ్మిలేరు



తమ్మిలేరు లాకుల వద్ద దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

చింతలపూడి: ఏలూరు, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తమ్మిలేరుకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ప్రవాహం తగ్గింది. ఆంధ్రా కాల్వ నుంచి తమ్మిలేరుకు గంటకు 850 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్టు నుంచి అవుట్ ఫ్లోను అధికారులు తగ్గించారు. ప్రాజెక్టు నుంచి గంటకు 850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టు వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 347 అడుగులుగా ఉంది. గోనెల వాగు బేసిన్ కూడా 347 అడుగులు ఉన్నట్లు తెలిపారు. వరద ఉధృతిని ముందుగానే గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదకర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పారు.

శంకర్ నేత్రాలయతో నిట్ ఒప్పందం



శంకర్ కంటి ఆసుపత్రితో నిట్ అధికారులు ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రితో కలిసి హైదరాబాద్‌లో నిర్వహించిన నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఏపి నిట్ అవగాహన ఒప్పందం చేసుకుంది. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి , శంకర్ కంటి ఆసుపత్రి సిక్యూఐ అండ్ రీసెర్చ్ డాక్టర్ టి.రవీంద్ర ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. గ్లకోమా వ్యాధికి కృత్రిమ మేధస్సుతో మందు కనుగొనేందుకు నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యుడు డాక్టర్ ఫణి కృష్ణ కర్రి ఆధ్వర్యంలో పరిశోధనలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా వివరించారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి యాప్ ద్వారా గ్లకోమా వ్యాధిని ముందుగా గుర్తిస్తారన్నారు.


13న స్కూల్ గేమ్స్ మహిళా జట్ల ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 విభాగంలో జరిగే మహిళా క్రీడా పోటీలకు సంబంధించి జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 13న ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా జూనియర్ కళాశాలలో జరుగుతుందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆండాళ్ళు ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాజు ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షా ఫలితాలు విడుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గత మే 2024లో రాసిన డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఫలితాలను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 28 నుంచి ఆగస్టు 2 వరకూ జరిగాయని, ఫలితాలు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి



లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు ఎక్కువగా రాజీచేయడానికి చర్యలు తీసుకోవాలని భీమవరం పోక్సో కోర్టు జడ్జి ఎంఏ సోమశేఖర్ అన్నారు. బుధవారం భీమవరం పోక్సో కోర్టులో స్థానిక న్యాయమూర్తులు, భీమవరం కోర్టుల పరిధిలోని పోలీసు సిబ్బందితో సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసే రాజీ చేయదగిన నేరాలు, చాలా కాలంగా నాన్ బెయిలబుల్ వారెంట్ పెండింగులో ఉండి ఫిర్యాది రాజీకి వచ్చిన కేసులు, దొంగతనం కేసులు, వరకట్న వేధింపు కేసులు, గృహహింస కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసుల రాజీకి పోలీసులు కృషి చేయాలన్నారు.

ముంచెత్తిన గోదావరి

- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పలు గ్రామాలు నీట మునక
- నరసాపురం వద్ద వశిష్ట ఉగ్రరూపం
- యలమంచిలి మండలంలో లంక గ్రామాలకు ముప్పు

కుక్కునూరు: గోదావరి నది ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద తాకిడి పెరిగింది. తెలంగాణలోని మేడిగడ్డ, శ్రీరాం సాగర్, తాలిపేరు ప్రాజెక్ట్‌లోకి సామర్థ్యానికి మించి వరద నీరు చేరడంతో ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద మంగళవారం ఉదయం నుంచి గోదావరి వేగంగా పెరిగింది. సోమవారం ఉదయం భద్రాచలం వద్ద 26 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం రాత్రికి 49 అడుగులకు చేరింది. బుధవారం ఉదయం భద్రాచలం వద్ద 50 అడుగులకు చేరింది. వేగంగా పెరిగిన వరదతో మండల వాసులు బెంబేలెత్తిపోతున్నారు. వరద నీరు మండలంలోని ఎర్రబోరు-చిరవెల్లి గ్రామాల మధ్య పాలవాగు మీదుగా ఆర్ అండ్ బీ రహదారిని ముంచెత్తింది. దీంతో కుక్కునూరు-బూర్గంపాడు మధ్య రాకపోకలు స్తంభించాయి. మండలంలోని వేలాది ఎకరాల్లో పంట చేలు నీటమునిగాయి. పెరిగిన వరదతో కుక్కునూరు గ్రామంలోని సమ్మక్క-సారక్క దేవాలయాన్ని వరదనీరు చుట్టుముట్టింది. బెస్తగూడెం ఎస్సీ కాలనీలో ఇళ్ల సమీపానికి వరద నీరు చేరింది. శ్రీధర వేలేరు, సీతారామనగరం గ్రామాల మధ్య వరద రోడ్డును ముంచెత్తడంతో మంగళవారం నుంచే రాకపోకలు స్తంభించాయి. బుధవారం మధ్యాహ్నం వరకు భద్రాచలం వద్ద 50 అడుగులతో నిలకడగా ఉన్న గోదావరి మధ్యాహ్నం నుంచి స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో అటు అధికారులు, ఇటు మండల వాసులు ఊపిరిపీల్చుకున్నారు. శబరి పోటు కారణంగా గోదావరి వరద మండలంలో అనుకున్నంత వేగంగా తగ్గలేదు. గోదావరి వరదతో పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న గొమ్ముగూడెం నిర్వాసితులకు అధికారులు బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు.

వశిష్ట గోదావరి ఉగ్రరూపం

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు చేరుతుండటంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారంతో పోలిస్తే బుధవారం వలంధర్ రేవులో 3 అడుగులు మేర నీటిమట్టం పెరిగింది. వలంధర్ రేవు వద్ద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండడంతో స్నానాలు నిలుపుదల చేశారు. పడవల రేవులో పంటు రాకపోకలు నిలిచిపోయాయి. లలితాంబ ఘాట్, అమరేశ్వర ఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. బాపూ విగ్రహం వరకూ గోదావరి నీటిమట్టం పెరిగింది. గోదావరిని ఆనుకుని ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం, ఎన్టీఆర్ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పొన్నపల్లి వద్ద స్లూయిజ్ గుండా వరదనీరు రోడ్డపైకి చేరుతుండటంతో మున్సిపాలిటీ ఇంజిన్‌లు ఏర్పాటు చేసి మళ్లీ ఆ నీటిని గోదావరిలోకి తోడుతున్నారు.

ముంపులోనే కనకాయలంక కాజ్‌వే

యలమంచిలి: గోదావరిలో వరద నీరు నిలకడగా ప్రవహిస్తోంది. కనకాయలంక వద్ద కాజ్‌వే మీద సుమారు నాలుగు అడుగుల వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఫిషరీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. నాలుగు ఇంజిన్ పడవలు ఏర్పాటుచేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. నరసాపురం ఆర్డీఓ అచ్యుత అంబరీష్ బుధవారం వడ్డిలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం గ్రామాలలో పర్యటించారు. వడ్డిలంక వద్ద ఉన్న నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్ తలుపు సరిగా పనిచేయడం లేదు. తలుపు పూర్తిగా మూసుకోకపోవడంతో గోదావరిలో నీరు నక్కల డ్రెయిన్‌లోకి వేగంగా వెళ్తోంది. గోదావరిలో మరింత వరద పెరిగితే వడ్డిపర్రు, గుమ్మలూరు, వల్లూరు, గుంపర్రు, బూరుగుపల్లి, కాంభొట్లపాలెం, చింతదిబ్బ, నారినమెరక, వడ్డిలంక, కట్టుపాలెం, మట్లపాలెం, గంగడుపాలెం తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలతోపాటు సుమారు 8 వేల ఎకరాల్లో వరి పొలాలు, ఆక్వా చెరువులు ముంపునకు గురయ్యే ప్రమాదముంది.



వేలేరుపాడు: టేకూరులో నీటమునిగిన ఇళ్లు



వేలేరుపాడు: వేలేరుపాడులో పడవలపై ప్రయాణం



యలమంచిలి: కనకాయలంక వద్ద కాజ్‌వే మీద ఉధృతంగా గోదావరి

33 గ్రామాల జలదిగ్బంధం

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా తగ్గినా గ్రామాల్లో ముంపు వీడటం లేదు. శబరి వల్ల ఉధృతి మరింత పెరుగుతోంది. దీంతో పరీవాహక వాసులు బిక్కు బిక్కుమంటున్నారు. కూనవరం వద్ద శబరి, సీలేరు, తాలిపేరు తదితర నదుల ఎగపోటు వల్ల వేలేరుపాడు మండలంలో 33 గ్రామాలు పదో రోజు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరి వరద వల్ల వేలేరుపాడు మండలంలో 2,437 మంది నిరాశ్రయులయ్యారు. వేలేరుపాడు సంతబజారు, చాకలి బజారు, రుద్రమకోట, తిర్లాపురం, పాత నార్లవరం , చిగురుమామిడి, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, టేకూరు, పూసుగొంది, టేకుపల్లి, కాకిస్‌నూరు, పేరంటపల్లి తదితర గ్రామాల్లో ఇళ్లు నీటమునిగాయి, దిగువ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు నీట మునగడంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా మంగళవారం అర్ధరాత్రి నిలిపివేశారు.



కుక్కునూరు: సమ్మక్క-సారక్క ఆలయాన్ని చుట్టుముట్టిన గోదావరి వరద



నరసాపురం: వలంధర్ రేవు వద్ద గోదావరి నీటిమట్టం



యలమంచిలి: కనకాయలంక వద్ద కాజ్‌వే మునిగిపోవడంతో పడవలపై ప్రయాణం

కొల్లేరు ముంపు ప్రజల్ని ఆదుకోవాలి

పీవీఎల్ నర్సింహ రాజు

ఆకివీడు: ఉప్పుటేరులో ముంపునీటి ప్రవాహ వ్యత్యాసాలను డ్రెయినేజీ, రెవెన్యూ శాఖ అధికారులు గుర్తించకపోవడం వల్లే తీర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో ముంపునకు గురైన కొల్లేరు తీర గ్రామాలు సిద్ధాపురం, కురుపాక, కాళింగగూడెం, చినమిల్లిపాడు, రాజులపేట, కోళ్లపర్రు, చినకాపవరం, గుమ్ములూరు, పెదకాపవరం, అప్పారావుపేట తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. పీవీఎల్ మాట్లాడుతూ ఆకివీడు ఆర్ అండ్ బీ వంతెన, రైల్వే వంతెనల వద్ద పూడికలు మేట వేశాయన్నారు. దీని వల్ల ప్రవాహంలో తేడా ఉందని చెప్పారు. అదనపు నీరు గ్రామాల్ని ముంచెత్తుతుందన్నారు. పూడికలు, గుర్రపుడెక్క, మేటలు ఆక్రమణలు తొలగించాలని పీవీఎల్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉప్పుటేరు, కొల్లేరుపై దృష్టి పెట్టి రైతుల్ని, ప్రజల్ని, పంటల్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, సర్పంచుల చాంబర్ మండల అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, కేశిరెడ్డి మురళీ, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు అంబటి రమేష్, ఇందుకూరి నారాయణ రాజు, జంపన సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



చినమిల్లిపాడులో నీట మునిగిన వరి పొలాల్ని పరిశీలిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య సండ్ర



సండ్ర అమరేంద్ర కుమార్

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) రిజిస్ట్రార్‌గా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 2016లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరి 2021లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2024లో అడ్మిషన్ల కన్వీనర్‌గా నిర్వహించారు. గతంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, పరిపాలనాధికారిగా, డైరెక్టర్‌గా పనిచేశారు. అమరేంద్రకుమార్‌ను నియమించడం పట్ల నాలుగు ట్రిపుల్ ఐటీ అధికారులు, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద వచ్చే అవకాశం ఉన్నందున లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం ఆచంట మండలం లంక గ్రామాలు అయోధ్యలంక, మర్రిమూల, కరుగోరుమిల్లిల్లో పర్యటించి ఆరోగ్య శిబిరాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలు పరిశీలించారు. లంక గ్రామాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. లంక గ్రామాల్లో తొమ్మిది, మిగతా ప్రాంతాల్లో నాలుగు పునరావాస కేంద్రాలు ఉన్నాయన్నారు. నెలలు నిండిన గర్భిణులను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలన్నారు. అనధికార పడవల రాకపోకలు జరగకుండా నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, డీఎస్పీ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆచంట మండలం అయోధ్యలంకలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మిక పర్యటన

ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

భీమవరం: సార్వత్రిక విద్యాపీఠానికి సంబంధించిన టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఫీజు చెల్లించడానికి గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైన్ లేకుండా ఫీజు చెల్లించడానికి ఈ నెల 15న, రూ.200 ఫైన్‌తో ఈ నెల 16 నుంచి 25 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

వచ్చారు.. వెళ్లారు

- కొల్లేరుపై నోరుమెదపని ముఖ్యమంత్రి చంద్రబాబు
- బ్రిడ్జిపై నుంచి 5 నిమిషాలు తమ్మిలేరు పరిశీలన
- గొప్పలు, రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం
- ఎంపిక చేసిన రైతులు, నాయకులకే ఆడిటోరియంలోకి అనుమతి
- సీఎం పర్యటనకు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేల డుమ్మా

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏలూరు వచ్చారు.. వెళ్ళిపోయారు. అంతకుమించి ఏమి వరద బాధితులను ఆదుకునే ఒక్క ప్రకటనా చేయలేదు. ఉమ్మడి పశ్చిమలో అత్యంత కీలకమైన కొల్లేరుపై కనీస ప్రస్తావన లేదు. ఐదు నిమిషాలు.. అది కూడా బ్రిడ్జిపై నుంచి రిటైనింగ్ వాల్ కట్టిన తమ్మిలేరును పరిశీలించారు. చివరిగా ఉప్పుటేరుపై రెగ్యులేటర్ల విషయం సీరియస్‌గా ఆలోచిస్తానని ఒక మాట చెప్పారు. ఇదీ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరదపై నిర్వహించిన సమీక్ష.. దాదాపు గంటసేపు మాట్లాడిన మాటలన్నీ గొప్పలు చెప్పుకోవడం, ప్రతిపక్షాన్ని విమర్శించడం తప్ప జిల్లాలో వరదపై చర్చ జరగని పరిస్థితి. నిజానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం ఆకివీడులో పర్యటించాలి. వాతావరణం అనుకూలించని కారణంగా పర్యటనను ఆకస్మాత్తుగా ఏలూరుకు మార్చేశారు. సీఆర్ రెడ్డి కళాశాల గ్రౌండ్ హెలీప్యాడ్‌లో దిగిన ముఖ్యమంత్రి అక్కడ నుంచి నేరుగా కొత్తబస్టాండ్ సమీపంలోని తమ్మిలేరును బ్రిడ్జిపై నుంచి కేవలం 5 నిమిషాలు పరిశీలించారు. వెంటనే సీఆర్ రెడ్డి ఆడిటోరియంలో ఎంపిక చేసిన వరద బాధితులు, నాయకులు, అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. అక్కడ నూజివీడు, తమ్మిలేరు వరద నష్టాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, ఉప్పుటేరు పరిస్థితిపై లైవ్ ప్రజెంటేషన్ పది నిమిషాల్లో ముగించి ఎంపిక చేసిన ఐదుగురితో మాట్లాడించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుదీర్ఘంగా మాట్లాడారు.



బ్రిడ్జిపై నుంచి తమ్మిలేరు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

అంతా నా వల్లే

విజయవాడ వరదలు సమర్థంగా ఎదుర్కొన్నానంటూ ఒకటికి నాలుగుసార్లు చెప్పారు. మొదటి రెండు రోజులు అధికారులు కూడా నీళ్ళల్లోకి దిగి పని చేయకపోతుంటే తాను బురదలో నడిచానని, అప్పుడు ఐఏఎస్‌లు, అధికారులందరూ వచ్చారని, అంతా నా వల్లే జరిగిందని చెప్పారు.

ప్రసంగంలో ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీని తీవ్రస్థాయిలో విమర్శించడం, అలాగే సాయం చేయడానికి డబ్బులు లేవని.. ఖజానా ఖాళీ అంటూ చెప్పుకొచ్చారు. తిత్లీ తుఫాన్ సమయంలో ఎకరాకు రూ.20 వేలు తానే ఇచ్చానని, ఇప్పుడు ఎకరాకు రూ.10 వేలు ఇస్తానని చెప్పి ఎంపిక చేసిన వారితో చప్పట్లు కొట్టించుకున్నారు.

కొల్లేరు ఊసు లేదు

ఉమ్మడి పశ్చిమలో అత్యంత కీలకమైన కొల్లేరు మహోగ్రరూపం దాల్చడంతో పదుల సంఖ్యలో లంక గ్రామాలు విలవిల్లాడుతున్నాయి. కొల్లేరు, తమ్మిలేరు, ఉప్పుటేరుపై సమీక్ష అని ప్రకటించినా కొల్లేరు ప్రస్తావనే లేదు. లంక గ్రామాల్లో పరిస్థితులు చక్కదిద్దడం, బాధితులకు అందచేసే సాయం, పరిహారంపై ఊసేలేదు. ఇక కొల్లేరు ప్రక్షాళనపై మాట కూడా లేదు. ఒక్క తమ్మిలేరుపై శనివారపుపేటలో రూ.15 కోట్లతో కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించానని చెప్పడం మినహా జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేదు.

ప్రజాప్రతినిధుల డుమ్మా : టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. పోలవరం, చింతలపూడి ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, సొంగా రోషన్, భీమవరం ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు, తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌లు గైర్హాజరయ్యారు.

అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రి చంద్రబాబు ఏలూరు పర్యటన సందర్భంగా నగర ప్రజలకు అడుగడుగునా ట్రాఫిక్ అడ్డంకులు ఎదురయ్యాయి. హెలీప్యాడ్‌కు ఉదయం 11.10 గంటలకు సీఎం వస్తారని షెడ్యూల్ ప్రకటించగా ఆయన 11.45 గంటలకు వచ్చారు. ముఖ్యమంత్రి రావడానికి మూడు గంటల ముందు నుంచే నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ఆయా కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, పని మీద వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక పోస్టల్ కాలనీ, శాంతినగర్, ఎన్టీఆర్ కాలనీ, రామకృష్ణాపురం వంటి ప్రాంతాల్లో ఉండే ఆయా కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది అర కిలోమీటరు ప్రయాణానికి నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది. సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ నుంచి ట్రాఫిక్ మళ్లించడంతో శాంతినగర్, విద్యా నగర్, గ్రేవియర్ నగర్ శనివారపు పేట కాజ్‌వే నుంచి అమీనా పేట మీదుగా రావాల్సి వచ్చింది. ఉదయం 8 గంటల నుంచి చంద్రబాబు పర్యటన ముగిసే వరకూ కొత్త బస్టాండులోకి కూడా ప్రజలను అనుమతించక లేదు. అత్యవసర పనుల నిమిత్తం విజయవాడ, తాడేపల్లిగూడెం, జంగారెడ్డి గూడెం, చింతలపూడి వంటి ప్రాంతాలకు వెళ్ళే బస్సులు లేక ఇబ్బంది పడ్డారు.



నగరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

క్లుప్తంగా

అరటితో మనీ పర్సులు


కేవీకేలో అరటితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: అరటితో మనీ పర్సులు వంటివి కూడా తయారుచేయవచ్చని వెంకట్రామన్నగూడెంలోని కృషి విజ్ఞానకేంద్రంలో జరుగుతున్న అరటితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కార్యక్రమంలో శిక్షకులు వివరించారు. అరటినారతో తాడు, మనీపర్సు, కోర్‌మేట్‌లు, పెన్ స్టాండుల తయారీపై బుధవారం శిక్షణ ఇచ్చారు. అల్లికలు, తాడు తయారీ, నారతీయడం, ఎండబెట్టడం, ప్లేట్లు, గ్లాసులు, స్టాండులు తయారు చేయడం నేర్పించారు. అరటి వ్యర్థంతో వచ్చిన పిప్పి ద్వారా కాగితం తయారీలపై కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ, కె.వెంకటసతీష్, ఎస్.ప్రశాంత్, ఎస్.కార్తికేయన్ తదితరులు తెలియజేశారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


ఆచంటలో పట్టుబడిన రేషన్ బియ్యం

పెనుగొండ: ఆచంటలో 35 క్వింటాళ్ల రేషన బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ పి శివరామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి రాంబాబు కు అందిన సమాచారంతో ఆచంటలో గెల్లి వెంకట విశ్వనాథగుప్తకు చెందిన ఇంటిలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. అతని వద్ద అక్రమంగా లభించిన 35 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదుచేశామన్నారు. బియ్యం విలువ రూ.1.40లక్షలు ఉంటుందన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ బి కన్యాకుమారి, ఏఓ పి సురేష్, ఆచంట ఆర్ఐ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.9 లక్షలు


హుండీని లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. సుమారు 45 రోజులకుగాను రూ 9,89,895 ఆదాయం లభించినట్లు ఈవో డి రామకృష్ణంరాజు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ తనిఖీ అధికారి వర్దినేడి వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలక వర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


కైకలూరు: పందిరిపల్లిగూడెం గ్రామం చేరేందుకు ప్రమాదకర పడవ ప్రయాణం

కొల్లేరు.. కన్నీరు..

- ప్రమాదకరస్థాయిలో పెదఎడ్లగాడి వంతెన నీటిమట్టం
- డ్రెయిన్లు పొంగటంతో కైకలూరు మునక

కైకలూరు: ఎగువ నుంచి చేరే వరద నీటిలో కొల్లేరు గ్రామాలు నానుతున్నాయి. ఊర్లుకు ఊర్లు ఏరులుగా మారాయి. విజయవాడ ఎగువ ప్రాంతం నుంచి బుడమేరు నీరుకు తోడు స్థానిక డ్రెయిన్ల నీరు చేరడంతో కొల్లేరు ఉగ్రరూపం దాల్చింది. మండవల్లి మండలం పెనుమాకలంక, ఇంగిలిపాక లంక, కొవ్వాడలంక, పులపర్రు, నుచ్చుమిల్లి, సుబ్బారావుపేటతో పాటు కై కలూరు మండలం పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, కొట్టాడ, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, పందిరిపల్లిగూడెం ఇలా కొల్లేరు గ్రామాలన్నీ నీట మునిగాయి. ప్రజలకు పడవలే దిక్కయ్యాయి. వారం రోజులపైబడి నీరు కదలకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యావసర సరుకులను రెవెన్యూ అధికారులు పంపిణీ చేయడం లేదు.

కైకలూరు జలమయం

నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కై కలూరును వరద వదలలేదు. పుల్లవ, రాళ్ళకోడు, కొమ్ములేరు, శ్యాంప్ డ్రెయిన్ల పొంగటంతో అనేక వార్డుల్లో వరద నీరు పొంగిపొర్లుతోంది. ప్రధానంగా 1, 2, 3, 7 వార్డుల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. ఇప్పటికే వెలంపేట కాలనీ వాసులు వరద నీటితో అనేక ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ల ఆక్రమణలు, మరమ్మతులు చేయకపోడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని భావిస్తున్నారు. కైకలూరు కోర్టు వీధిలో బీసీ హాస్టల్ దగ్గర నుంచి రోడ్డు మునిగింది. కైకలూరు ఫైర్‌స్టేషన్ రోడ్ నుంచి నేషనల్ స్కూల్‌కు చేరే రోడ్డులో వరద నీరు పారుతోంది. ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కైకలూరు: కొట్టాడ గ్రామంలో అవస్థలు ఇలా..

భయపెడుతున్న పెదఎడ్లగాడి వంతెన

ఎగువ నుంచి వచ్చే వరదనీటిని సముద్రానికి పంపించే కైకలూరు – ఏలూరు రహదారిలో పెదఎడ్లగాడి వంతెన వద్ద బుధవారానికి 3.38 మీటర్ల నీటి మట్టం నమోదయ్యింది. ఇదే 4 మీటర్లుకు చేరితే వరద నీటిలో కొల్లేరు సమీప గ్రామాలు సైతం మునుగుతాయి. ఒక పక్క ఎగువ నుంచి నీటి మట్టం పెరుగుతుంటే మరో పక్క నీటిని క్రిందకు తీసుకువెళ్లే ఉప్పుటేరు ముఖద్వారం వద్ద అనుకున్నంత స్థాయిలో నీరు చేరడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని గ్రామాలు నీటిలో మునుగుతాయని కొల్లేరు పెద్దలు భావిస్తున్నారు.

కుమారుడి కోసం వరద ఉధృతిని లెక్కచేయకుండా..

మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామం మొత్తం జలదిగ్బంధనంలో చిక్కుకుంది. ప్రజలు గ్రామం దాటకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ కుమారుడికి అనారోగ్యంగా ఉందని, వెంటనే ఏలూరు రావాలని సెల్‌ఫోన్‌లో సమాచారం వచ్చింది. ఒకపక్కన సుడులు తిరుగుతున్న వరద ఉధృతి. అయినప్పటికీ గ్రామ సర్పంచ్ మరి కొందరు ధైర్యం చేసి పడవను పెదఎడ్లగాడి వంతెన వరకు అతికష్టం మీద తీసుకెళ్లారు. అక్కడ నుంచి వాహనంపై సదరు కానిస్టేబుల్ ఏలూరులో కుమారుడి వద్దకు వెళ్లాడు. ఇటువంటి సంఘనలు రోజు కొల్లేరులో తారసపడుతోన్నాయి.

వరద నీటిలోనే ఆసుపత్రికి..


ఆసుపత్రికి వెళ్లి కొట్టాడ ముంపు గ్రామానికి చంటి బిడ్డతో నడిచి వస్తున్న అనూషా

కైకలూరు మండలానికి చెందిన కొట్టాడకు చెందిన జంగం అనూషాకు 7 నెలల బాబు. ఏలూరు రూరల్ మండలం కోమటిలంక వ్యక్తితో ఇటీవల వివాహమైంది. అత్తారింటి నుంచి చెల్లెలు వివాహం నిమిత్తం కొట్టాడ వచ్చింది. ఇంతలో బాబుకు అనారోగ్యం చేసింది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో బుధవారం డాక్టర్‌కు చూపించి పెంచికలమర్రు నుంచి రెండు కిలోమీటర్లు వరద నీటిలో బాబుతో నడిచింది. వరద ప్రవాహవేగం పెరుగుతున్నప్పటికీ బిడ్డతోనే ఎట్టకేలకు గ్రామం చేరింది. పుట్టిళ్లు, అత్తారిళ్లు రెండు ముంపులో చిక్కుకున్నాయి.

తీరంలో తప్పని ముంపు తిప్పలు

ఆకివీడు: కొల్లేరు సరస్సు తీరంలోని గ్రామాల్లో ముంపు నీటితో తిప్పలు తప్పడంలేదు. కొన్ని గ్రామాలు ఇప్పటికే జలదిగ్బంధంలో ఉన్నాయి. ఆకివీడు–సిద్ధాపురం రోడ్డులో స్థానిక అటవీ చెక్ పోస్టు వద్ద రోడ్డుపై అరకిలోమీటరు నీరు నిలబడి ఉంది. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. సిద్ధాపురం గ్రామంలోకి ముంపు నీరు చొచ్చుకురాకుండా ఇసుక, మట్టి బస్తాలతో అడ్డుకట్ట వేశారు. పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. రాజులకొట్టాడ గ్రామం జలదిగ్బంధంలో ఉంది. గ్రామం నుంచి ప్రజలు, విద్యార్థులు బయటకు రావాలంటే పడవలపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. సిద్ధాపురం, చినమిల్లిపాడు, రాజులపేట, కోళ్లపర్రు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే పది కిలోమీటర్ల చుట్టూతిరిగి రావలసిన పరిస్థితి ఏర్పడింది. కోళ్లపర్రు గ్రామం వద్ద చినకాపవరం డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. ముంపు నీరు మరింత పెరిగితే మరిన్ని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకునే ప్రమాదముంది. కొన్ని చోట్ల పంట కాల్వలు ఎదురు ప్రవహిస్తుండటంతో గ్రామాల ముంపు తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రి, ఎమ్మార్వో ఆఫీసు వద్ద ఉన్న చంద్రబాబు నగర్ కాలనీ నీట మునిగాయి. తమ కాలనీకి ఎవరు వచ్చినా చూసి వెళ్తున్నారే తప్ప, సహాయం అందజేయడం లేదని బాధిత మహిళలు వాపోతున్నారు. పునరావాస కేంద్రాలకు వెళ్లలేమని, నిత్యావసర వస్తువులు అందజేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సమతానగర్ కాలనీలో ముంపునీరు మరింత పెరిగి ఇళ్లను ముంచెత్తుతోంది. గత కొన్నేళ్లుగా బీడు భూమిగా ఉన్న మూలలంకలోని 70 ఎకరాల పంట భూమి పూర్తిగా నీట మునిగింది. మూలలంక ముంపు నుంచి సమీపంలోని 16, 17 వార్డుల్లోకి ముంపు నీరు చొచ్చుకువస్తోంది.


ఆకివీడు: రాజుల కొట్టాడ నుంచి సిద్ధాపురం జెడ్పీ స్కూల్‌కు పడవపై వస్తున్న విద్యార్థులు


ఆకివీడు: సిద్ధాపురం రోడ్డులో ముంపునీరు


కైకలూరు: శృంగవరప్పాడు సమీపంలో తెగిన రొయ్యల చెరువు గట్లు


ఆకివీడు: సిద్ధాపురంలో మట్టి బస్తాలతో అడ్డుకట్ట వేసిన దృశ్యం


ఆకివీడు: నీట మునిగిన ఆకివీడు సీహెచ్‌సీ ప్రాంగణం

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు 40 మంది క్రీడాకారులు ఎంపిక

తణుకు అర్బన్: విద్యార్థి దశలోనే క్రీడల్లో ప్రతిభాపాటవాలను చూపించాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్ అన్నారు. తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో రాణించి విద్యలో ప్రతిభ చూపిస్తే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గా ఉంటాయని అన్నారు. వివిధ కేటగిరీలకు సంబంధించి బాలురు, బాలికలకు నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మొత్తం 300 మంది పాల్గొనగా 40 మంది విజేతలయ్యారని వారంతా ఈ నెలాఖరున గుంటూరు నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. విజేతలకు గంట రవికుమార్ సౌజన్యంతో మెడల్స్, ప్రశంసాపత్రాలు అందచేయగా, క్రీడాకారులకు మానేపల్లి శ్రీనివాస్ భోజనవసతి కల్పించారు.

అథ్లెటిక్ జ్యోతికశ్రీకి సత్కారం

ఇటీవల ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారతదేశం తరపున రిలే పోటీలో ప్రాతినిధ్యం వహించిన దండి జ్యోతికశ్రీని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.బాబూరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్‌వీ సత్యనారాయణ, టి.వినోద, జి.నాగరాజ్యం, కె.సంధ్యారాణి, వి.పద్మావతి, పి.ప్రసాద్, కె.వెంకన్నబాబు, ఎ.నాగేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు మెడల్స్ అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

మలేరియాతో ఇద్దరు యువకులు మృతి


మేకం బ్రైనార్డ్ బెన్‌హిన్ బౌండ్స్ (ఫైల్)


పల్లి దిలీప్‌కుమార్ (ఫైల్)

అత్తిలి: మలేరియా జ్వరం బారిన పడి ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తిలి శివారు నేతాజీ నగర్‌కు చెందిన పాస్టర్ ఎం.దేవరాజు తన ఇద్దరు కుమారులు, భార్యతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరో 8 మందితో గత నెల 18న ఒడిసాలోని రాయఘడ్ ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లి అక్కడ సువార్త సేవల్లో పాల్గొన్నారు. వీరంతా తిరిగి గత నెల 23న స్వగ్రామాలకు చేరుకున్నారు. అయితే అదేనెల 27న పాస్టర్ మేకం దేవరాజు చిన్న కుమారుడు మేకం బ్రైనార్డ్ బెన్‌హిన్ బౌండ్స్‌కు(17) జ్వరం బారిన పడ్డాడు. స్థానికంగా వైద్యసేవలు పొందినా జ్వరం తగ్గక పోవడంతో ఈనెల 6న తణుకులో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యసేవలు పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కాంప్లికేటెడ్ మలేరియా సోకడం వల్ల బ్రైనార్డ్ బెన్‌హిన్ బౌండ్స్ మృతిచెందినట్లు వైద్య పరీక్షలలో తేలిందని వైద్యాధికారి నాగరాజు తెలిపారు. పెద్దకుమారుడు మేకం విల్సన్ బౌండ్ సైతం ప్రస్తుతం తీవ్రమైన జ్వరంతో రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే సువార్త సేవకు వెళ్లిన అత్తిలి గ్రామానికి చెందిన మరో యువకుడు పల్లి దిలీప్‌కుమార్ (19) అనే యువకుడు జ్వరంతో బాధపడుతూ తణుకు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఒడిసా వెళ్లిన మొత్తం 12 మందిలో ఇద్దరు యువకులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాజు మృతదేహం

తణుకు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు తణుకు పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. గతేడాది సెప్టెంబరు 14న తణుకు శర్మిష్ట సెంటర్ జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై వెళుతున్న ఉండ్రాజవరం గ్రామానికి చెందిన మార్లపూడి రాజు (45), చదలవాడ ప్రేమ్‌కుమార్‌లను కారు ఢీకొట్టడంతో ప్రేమ్ కుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అయితే అప్పట్లో తీవ్రగాయాలపాలైన రాజును ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి మంచానికే పరిమితమైన రాజు మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నేడు జిల్లా జట్ల ఎంపిక

భీమవరం: ఆట్యాపాట్యా జూనియర్స్ జిల్లా జట్ల ఎంపిక భీమవరం పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఆట్యాపాట్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి కిరణ్‌వర్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆట్యాపాట్యా జూనియర్స్ విభాగంలో బాలురు, బాలికల జట్ల ఎంపిక గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదీల్లో కర్నూల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్స్ ఆట్యాపాట్యా పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు 2007 జనవరి 1 తరువాత జన్మించి ఉండాలని వయసు ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకురావాలని అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్‌రాజు తెలిపారు.

నాకు చార్జ్ అప్పగించండి..

రామన్నగూడెం పంచాయతీ నూతన కార్యదర్శి వేడుకోలు

ద్వారకాతిరుమల: నాకు చార్జ్ అప్పగించండి.. విధుల్లో చేరనివ్వండి ప్లీజ్.. అంటూ నూతన పంచాయతీ కార్యదర్శి అక్కడి ఇన్‌చార్జి కార్యదర్శిని, ఉన్నతాధికారులను నెలరోజులుగా వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణవేణి, గత కొన్నాళ్లుగా రామన్నగూడెం పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం పంచాయతీలో గ్రేడ్–3 కార్యదర్శిగా పనిచేస్తున్న నాగరాజు, నెల రోజుల క్రితం గ్రేడ్–2 కార్యదర్శిగా పదోన్నతి పొంది, రామన్నగూడెంకు బదిలీ అయ్యారు. అయితే ఇక్కడ ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణవేణి నాగరాజుకు చార్జ్ అప్పగించడం లేదు. దీంతో ఈ విషయాన్ని ఆయన ఈఓపీఆర్డీ, డీఎల్‌పీఓ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఆది నుంచి కార్యదర్శి కృష్ణవేణిపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఈ పంచాయతీలో సుమారు రూ.8 లక్షల మేర అవినీతి జరిగిందని, ఇంకా మరికొన్ని అక్రమాలు ఉన్నాయని, అవి బయట పడతాయన్న భయంతోనే ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణవేణి నాగరాజుకు చార్జ్ అప్పగించడం లేదని స్థానికులు అంటున్నారు. దీనిపై ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌ను వివరణ కోరగా.. నూతన కార్యదర్శికి చార్జ్ అప్పగించాలని కృష్ణవేణికి ఇప్పటికే సూచించానని, ఆమె రికార్డు సిద్ధం చేస్తున్నట్టు తనతో చెప్పారని తెలిపారు.

వరద బాధితులకు 'బీవీ రాజు' విరాళం


కలెక్టర్ నాగరాణికి రూ.25 లక్షల చెక్కును అందిస్తున్న విష్ణురాజు

భీమవరం: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి భీమవరం పట్టణంలోని బీవీ రాజు విద్యాసంస్థల చైర్మన్ కేవీ విష్ణురాజు రూ.25 లక్షల విరాళం అందించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఆయన ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా నుంచి 13 మంది దాతలు సుమారు రూ.47.88 లక్షలు వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించారన్నారు. అంతేగాకుండా 4.09 లక్షల ఆహార పొట్లాలు, 1.85 లక్షల వాటర్ బాటిల్స్, 1.10 లక్షల వాటర్ ప్యాకెట్లు, 9,500 రొట్టెలు, 21,400 రస్కులు, 1.62 బిస్కెట్ ప్యాకెట్లు, 25 కేజీల రైస్ బ్యాగ్స్ 700 విజయవాడ పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన


భీమవరంలో ఎస్సీ మాలసంఘాల జేఏసీ నాయకుల నిరసన

భీమవరం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్సీ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జేఏసీ నాయకుడు కోనా జోసఫ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న నిరసనకు మద్దతుగా తాము ఆందోళన చేపట్టినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పునఃపరిశీలన చేయాలన్నారు. మాలయోధుల జేఏసీ ఆధ్వర్యంలో కూడా భీమవరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ సభ్యుడు తాళ్లూరి మధు, దళిత నాయకుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు భంగం కలిగించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీలకు జట్ల ఎంపిక


జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఏలూరు కేపీడీటీ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలబాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ పలాస వద్ద వజ్రపుకత్తూరులో 37వ రాష్ట్రస్థాయి జూనియర్, సబ్‌జూనియర్ టెన్నికాయిట్ పోటీలు జరగనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి టి తిరుమలరావు తెలిపారు. అనంతరం జిల్లా జట్లను ప్రకటించారు. ఇందులో సబ్‌జూనియర్ బాలుర విభాగంలో జి సామ్యేలు, ఐ.చరణ్, వై.విజయ్‌కుమార్, ఎం.చరణ్, బాలికల విభాగంలో టి.జాశ్రిత, ఆర్.సంస్మృతి, జె. సిరివల్లిక, జి.యశోధ, జూనియర్ బాలుర విభాగంలో ఎం.పవన్‌కుమార్, బి.రాజు, ఎం. దుర్గారావు, బి.ఆనంద్, బాలికల విభాగంలో జి.సత్యయామిని, ఎం.పూజిత, ఎం.గంగా, ఎం.చంద్రిక జట్టులో చోటు సాధించారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు యు.రాంప్రసాద్, పి.శ్యామ్‌బాబు, హెచ్‌ఎం ప్రేమ్‌చంద్ అభినందించారు.

వారణాసిలో యువకుల ఆత్మహత్య


పి.లక్ష్మీనారాయణ, పి.లోక్ వినోద్ (ఫైల్)

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సోదరులు పి.లక్ష్మీనారాయణ (34), పి.లోక్ వినోద్ (32) వారణాసిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారణాసి ప్రాంతంలోని భేలుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మానసరోవర్ ప్రాంతంలోని రామ్‌తారక్ ఆంధ్రా ఆశ్రమంలో మంగళవారం వేలాడుతున్న వీరి మృతదేహాలను పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని భేలుపూర్ ఏసీపీ ధనంజయ్‌మిశ్రా తెలిపారు. వీరిద్దరూ ఆగస్టు 28 నుంచి ఆశ్రమంలోని ఉన్నారని, తీర్థయాత్రల కోసం వచ్చినట్లు చెప్పారని ఆశ్రమం ట్రస్టు మేనేజరు వీవీ సుందరశాస్త్రి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వీరి గది నుంచి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. కాగా ఈ యువకులు ఏప్రిల్‌లో ఇల్లు వదిలి వెళ్లిపోయారు. మే 12న తాము ఆత్మహత్య చేసుకుని చనిపోతున్నట్లు వీడియోలు చిత్రీకరించి స్నేహితులకు పంపారు. ఈ నేపథ్యంలో రాజేష్ అనే యువకుడు కేసు కూడా పెట్టారు. ఈమేరకు మే 16న చేబ్రోలు పోలీ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. పట్టణానికి చెందిన 11 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన బోడగిరి రాజు అనే వ్యక్తి ఇంట్లోని బాత్రూమ్‌లోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేస్తు బయటకు వచ్చి తల్లికి చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

మాధవరంలో భారీ అన్నసమారాధన



మాధవరం వినాయకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం రామతులసి కోట సెంటర్‌లో నెలకొల్పిన వినాయకుని ఉత్సవ పందిరి వద్ద బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వరసిద్ధి వినాయక ఆలయ కమిటి చైర్మన్ లక్కాకుల రంజిత్‌కుమార్, అధ్యక్షుడు లక్కాకుల శ్రీనివాస్, సభ్యులు తారమట్ల శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారికి మొక్కుకుంటే ఇష్ట కార్యాలను నెరవేరుస్తారన్నారు. గురువారం సాయంత్రం ఆలయం వద్ద సిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యులు నల్ల బ్యాడ్జీలతో విధులకు



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీహర్ష

తాడేపల్లిగూడెం రూరల్: జీవో నెం.85ను రద్దు చేయాలని కోరుతూ బుధవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ మూడేళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండాపోయిందన్నారు. జీవో నెం.85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను ప్రభావితం చేస్తుందన్నారు. ఆకస్మాత్తుగా జీవోను తేవడం చాలా అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి చాలా నష్టం కలిగిస్తుందన్నారు. గత రెండు నెలలుగా ఈ జీవో రద్దు చేయమని అధికారులకు, ఎమ్మెల్యేలకు అర్జీలు అందజేశామన్నారు. అయితే ఎటువంటి సమాధానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రూపాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

చవితి పందిరిలో ఘర్షణ



చికిత్స పొందుతున్న ప్రసన్నకుమార్

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని వీకర్స్ కాలనీ మామిడితోటకు చెందిన చెందిన ప్రసన్నకుమార్ మోటారుసైకిల్ మెకానిక్ పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి ప్రసన్నకుమార్, అదే ప్రాంతానికి చెందిన యర్రా సతీష్‌ల మధ్య పాతగొడల నేపథ్యంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈనేపథ్యంలో యర్రా సతీష్ ఇనుపరాడ్డుతో ప్రసన్నకుమార్ తలపై బలంగా మోదడంతో తలకు తీవ్రగాయమై కిందపడిపోయాడు. ఇది చూసిన సతీష్ అక్కడి నుంచి పరారయ్యాడు. తలకు తీవ్రగాయమైన ప్రసన్నకుమార్‌ను స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రసన్నకుమార్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం అందజేసేందుకు రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రసన్నకుమార్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా!

వైభవంగా గణనాథుల ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో నెలకొల్పిన బాలగణేశుని ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సాగింది. రెండెడ్ల బండిపై స్వామివారిని ఉంచి గ్రామంలోని యువతుల నుంచి పెద్దల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని వెళ్లి రావయ్య.. మళ్ళీ రావయ్యా అంటూ సాగనంపారు. అనంతరం గ్రామంలోని చెరువులో స్వామివారిని నిమజ్జనంచేశారు. మాజీ ఎంపీపీ పరి మి రవికుమార్, టీడీపీ గ్రామ నాయకులు రామారావు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు. అలాగే, తాడేపల్లిగూడెం పట్టణంలోని చిన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద నెలకొల్పిన వినాయకుడిని ఊరేగించారు. ఉత్సవకమిటి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినాయక చవితి సందర్భంగా ఐదోవ రోజు బుధవారం పట్టణంలో గణపతి పందిరిలు వద్ద మహోత్సవాలు వైభవంగా జరిగాయి. చిన్నబలుసులమ్మ ఆలయం వద్ద గణపతి స్వామిని ఘనంగా ఊరేగించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. సవిత్రుపేటలో గణపతిస్వామికి చామంతి పూలతో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ నరిశే సోమేశ్వరరావు, గుండుబిల్లి సురేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. 5వ రోజు కావడంతో అనేక ప్రాంతాల నుంచి నిమజ్జన ఊరేగింపులు అంగరంగ వైభవంగా జరిగాయి. విచిత్ర వేషాలతో, బుట్ట బొమ్మలతో, తీన్‌మార్ డప్పులతో యూత్, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి గ్రామంలోని గణనాథుడిని రెండెడ్ల బండిపై ఊరేగిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత్ ఆటోమొబైల్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..



చిన్న బలుసులమ్మ ఆలయం వద్ద ఊరేగింపులో భాగంగా గణపతి ఉత్సవ మూర్తి, యూత్ సభ్యులు, మహిళలు



తాడేపల్లిగూడెం (టీఓసీ) : సవిత్రుపేటలో గణపతిస్వామి

వరద బాధితులకు ఆపన్న హస్తం



హెల్పింగ్ హ్యాండ్స్ కిడ్స్ చారిటీ క్లబ్‌కు విరాళాలు అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: మండలం వెంకట్రాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు సాయం అందజేసేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ కిడ్స్ చారిటీ క్లబ్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ చారిటీ క్లబ్‌ను బుధవారం సాయంత్రం పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విరాళాలు అందించినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని అమ్మాజీ, అంగన్‌వాడీ సిబ్బంది రత్నకుమారి, మణికుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ పాలమూరి ఆలాణ్య, వైస్ చైర్మన్ ముప్పిడి విజయలక్ష్మి, ప్రశాంతి, లలిత, కండెల్లి వెంకట్రావు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ జ్యోతికశ్రీకి అభినందనల వెల్లువ

- సత్కరించిన వాకర్స్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, స్వచ్ఛందసేవా సంస్థలు..
- తణుకులో జ్యోతికశ్రీ హవా..

తణుకు అర్బన్: పారిస్ ఒలింపిక్స్ 400 రిలే పరుగులో అత్యుత్తమ ప్రదర్శన కనబరచి అథ్లెటిక్ దండి జ్యోతికశ్రీ భారతదేశంలో అడుగుపెట్టి స్వగ్రామం తణుకు చేరిన రోజు నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తణుకులాంటి చిన్న పట్టణంలో 13 ఏళ్ల క్రితం వేసిన చిన్నపాటి అడుగులు నేడు ప్యారిస్ ఒలింపిక్స్‌ను తాకాయనే ఊహే ఎంతో గొప్పగా ఉందని క్రీడాకారులు, క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు. జ్యోతికశ్రీ పరుగు ప్రారంభించిన క్రీడాప్రాంగణం తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ అభినందన లకు వేదికగా నిలిచింది. గతనెల 9వ తేదీన పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించలేకపోయినా భారత బృందంలోని ముగ్గురికంటే అత్యుత్తమంగా వాయువేగంతో పరుగెత్తి 51.30 సెకన్లలో 400 మీటర్లు పూర్తిచేసి భారతదేశం గౌరవంతోపాటు తణుకు ప్రాంతానికి వన్నెతెచ్చింది. దీంతో జ్యోతికశ్రీకి తణుకులోనే కాకుండా దేశం నలుమూలల నుంచి సామాజిక మాధ్యమాల ద్వారా అభినందనలు వెల్లువెత్తాయి. తణుకులో ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లిందంటే ఆ ఘనత వెనుక ఎంతటి కఠోరశ్రమ, పట్టుదల, పోరాటపటిమ ఉందోనంటూ నెటిజన్లు సైతం జ్యోతికశ్రీని స్ఫూర్తిగా తీసుకోవాలంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

జ్యోతికశ్రీకి సత్కారం..

తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాకర్స్ ఆధ్వర్యంలో మొదలైన సత్కారాలు నేటికి కొనసాగుతున్నాయి. ఒలింపిక్స్‌లో ప్రదర్శన అనంతరం సెలబ్రటీగా మారిన జ్యోతికశ్రీతో కరచాలనం చేసేందుకు యువత, పెద్దలు, తణుకువాసులు అధికసంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో సైతం వివిధ కార్యక్రమాలకు అతిథిగా హాజరుకావాల్సిందిగా ఆహ్వానం ఇస్తూ సత్కారాలు చేస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, పలు అసోసియేషన్‌లు, రాజకీయ పార్టీలు సైతం జ్యోతికశ్రీతోపాటు తల్లి తండ్రులు దండి లక్ష్మీనాగ వెంకటేశ్వరి, శ్రీనివాసరావుతోపాటు శిక్షణనిచ్చిన కీర్తిశ్రీ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ కోచ్ కట్లపర్తి సీతారామయ్యను కూడా ఘనంగా సత్కరిస్తున్నారు. నా ప్రతి అడుగులోను నాన్న ఉన్నారని ఆయన కృషితోనే నేను ఈ స్థాయికి చేరానని, భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శనకు సిద్ధమవుతానని, దేశవ్యాప్తంగా నాకు అందిన ఆదరణ మరచిపోలేనని జ్యోతికశ్రీ సాక్షికి తెలిపింది.



తణుకులో జ్యోతికశ్రీని సత్కరించిన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు



అథ్లెటిక్ జ్యోతికశ్రీ, ఆమె తల్లితండ్రులను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

వర్గీకరణ చేస్తే సహించేది లేదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, పునఃసమీక్షించాలని ఢిల్లీలోని జంతర్, మంతర్ వద్ద మాయావతి, అఖిలేష్ యాదవ్, పాశ్వాన్, చంద్రశేఖర్ అజాద్‌లు చేస్తున్న నిరసనలకు సంఘీభావం చెబుతున్నామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు వెల్లడించారు. పట్టణంలో బుధవారం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లలర్పించారు. జరిగిన నిరసన కార్యక్రమంలో మంగరాజు మాట్లాడుతూ మందకృష్ణ తన స్వార్థ ప్రయోజనాల కోసం వర్గీకరణ చేయాలని మద్దతు ఇస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రాల పరిధిలో వర్గీకరణ చేస్తే సహించేది లేదన్నారు. ధర్మాసనం వెనక్కి తీసుకునే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు సునీల్ కుమార్, అచ్చిబాబు, సత్యకృష్ణ, మురళీ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాలూకా ఆఫీస్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చెబుతున్న మాల మహానాడు, దళిత నాయకులు

శ్రీవారి ఆలయానికి విరాళం అందజేత



కుంచనపల్లిలోని శ్రీవారి ఆలయంలో విగ్రహాల నిమిత్తం విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవీ భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో విగ్రహాలకు రూ.3లక్షలను నిడదవోలు రామారావు -నాగలక్ష్మి దంపతులు బుధవారం ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన 50వేల ఇటుకల నిమిత్తం రూ.3.50లక్షలను నిడదవోలు వినయ్ దంపతులు సమకూర్చారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



విజయవాడలో బాధితులకు నిత్యావసరాలను అందజేస్తున్న సభ్యులు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన కారుమంచి ఫౌండేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, ఆహారం, పళ్లు, దుప్పట్లు అందజేశారు. తణుకు పరిసర ప్రాంతాల్లో దాతల నుంచి సేకరించిన వీటిని విజయవాడకు తరలించి అక్కడ బాధితులకు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కారుమంచి యోహాన్, సభ్యులు బొమ్మాళి గురువేష్, షేక్ మదీనా, శ్రీధర్, శామ్యూల్, రామ్‌చరణ్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషకాలు మెండు

తణుకు టౌన్: చిరుధాన్యాలలో విలువైన పోషకాహార విలువలు ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అరుణ కుమారి తెలిపారు. బుధవారం తణుకులో మూడవ వార్డు జంగం చెరువులో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. రోగాలు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని కోరారు. మన చుట్టూ పెరిగే ఆకు కూరలు, కూరగాయలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకోవాలని కోరారు. తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఎక్కువగా ఉండటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తణుకు మండలం పైడిపర్రు సెక్టార్ పరిధిలోని దువ్వ గ్రామంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింత మహిళలకు పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిండివంటలా బాలామృతం అందించండి

అత్తిలి: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న బాలామృతాన్ని పిండి వంటలా చేసి చిన్నారులకు ఇస్తే ఇష్టంగా తింటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. మహా లక్ష్మి అన్నారు. పోషక మాసోత్సవాలలో భాగంగా బుధవారం అత్తిలి మండలం ఆరవల్లి, ఉనికిలి గ్రామాలలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ బాలామృతం ప్రాధాన్యతను వివరించారు. పిల్లల ఎదుగుదలకు ఇవ్వాల్సిన ఆహారాన్ని తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుస్వర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, సంధి విజయ, మీఎల్ఎస్ కుమారి, ఆశావర్కర్లు ధనలక్ష్మి పాల్గొన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం వరిఘేడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే సత్యశ్రీ, హెచ్‌ఎం రాధిక, ఏఎన్‌ఎం రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె మీనాకుమారి, బేబి, జి సావిత్రి తదితరులు పాల్గొన్నారు. అత్తిలి 2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కె కుమారి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తేజోకుమారి, జి కుమారి, పద్మ, పద్మశ్రీ పాల్గొన్నారు.

ఆకు కూరల్లో పోషకాలు మెండు

తాడేపల్లిగూడెం రూరల్: ఆకు కూరల్లో పోషకాలు మెండుగా లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవాలని గర్భవతులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం విధిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ముత్యాలు, కే.సునీత తదితరులు పాల్గొన్నారు.



తణుకులోని అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి



అత్తిలి:అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మహాలక్ష్మి



తాడేపల్లిగూడెం రూరల్: కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శశిలో గెస్టు లెక్చర్



శశిలో గెస్టు లెక్చర్ ఇచ్చిన సలాదిని సత్కరించిన చిత్రం

తాడేపల్లిగూడెం: శశి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం గెస్టులెక్చర్ నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీస్ నుంచి వచ్చిన ఆదిత్య సలాది పలు విషయాలను వివరించారు. మెషిన్‌లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ , ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల చైర్మన్ వేణుగోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ మొహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లికి చెందిన గద్దం గనిరాజు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అలాగే నరసాపురం మండలం లక్ష్మణేశ్వరానికి చెందిన ఎం.సుబ్బారావు అంగవైకల్యంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు వీరికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.


లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



విజయవాడలో సేవా కార్యక్రమాలలో పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో లియో ధనలక్ష్మి, మాధురి హెల్పింగ్ ఉమెన్స్ కెనడా తమ్మిన జగదీశ్వర్‌రావులు సహాయ సహకారాలతో బుధవారం విజయవాడలో వివిధ ప్రాంతాలలో హెల్త్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్, స్నాక్స్, బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. మునగాల జితేంద్ర, చెన్నారెడ్డి సతీష్, నార్ని చిన్ని, ఎం.సునీల్ కుమార్, ఆకుల సతీష్ నాయుడు, కాళ్ళ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వరద ముప్పు



యనమదుర్రు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న గ్రామ కార్యదర్శి పి. రవీంద్ర, రెవిన్యూ సిబ్బంది

పెంటపాడు: గత వారం రోజులు నుంచి ఆకాల వర్షం వల్ల పొంగిన యనమదుర్రు డ్రెయిన్ శాంతించింది. ఈ సందర్భంగా బుధవారం కొండేపాడు వద్ద గ్రామ కార్యదర్శి పసుపులేటి రవీంద్ర, మీనవిల్లూరు వంతెన వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు చల్లా లింగమూర్తిలు పరిశీలించారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న రజక వృత్తిదారుల సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం సాగించిన వీర నారి చాకలి ఐలమ్మ అని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు యండమూరి నాగేంద్ర అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బుధవారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ, రామకృష్ణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మడకరాజు మాట్లాడుతూ ఐలమ్మ, రామకృష్ణల పోరాట పటిమను ప్రతి ఒక్కరు ఆదర్శవంతంగా తీసుకోవాలని, జాతి హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.